క్లుప్తంగా

దుగ్గిరాల సచివాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్



సచివాలయ ఉద్యోగిని ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదవేగి : మండలంలోని దుగ్గిరాల గ్రామ సచివాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వాటిలోని లోపాలను సరిచేసుకుని మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. అందరూ క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని తెలిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మునిషా బేగం

పెదపాడు: ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పెదపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మునిషా బేగం తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వట్లూరు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఫాతిమా మాట్లాడుతూ ప్రభుత్వం సంపూర్ణ పోషకాహారం పథకంలో రాగిపిండి, అటుకులు, బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, గుడ్లు, పాలు, కంది పప్పు, నూనెతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వట్లూరులోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆడమిల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయభారతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదవేగి ఏఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జాతీయ స్కూలు గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్‌లో తమ విద్యార్థులు ఎస్‌కే ఫైజానవల్లి, కె.హారిక బేస్‌బాల్ పోటీలలో సీహెచ్ నాగసాయి, ఆర్.మౌనిక విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ మానుకొండ సుబ్బారావును ప్రధానోపాధ్యాయులు విజయభారతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: జిల్లాస్థాయి బేస్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలకు అండర్–14 బాలికలు విభాగంలో తమ పాఠశాలకు చెందిన ఎ.భవిత, కె.రోహిత్, సత్యా విద్యాబాల ఎంపికయ్యారని గవరవరం గ్రామానికి చెందిన వెంకటపతి రాజు విద్యాసంస్థల అధినేత సుభద్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం పెదవేగి జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఈ ఎంపికలు చేశారని వివరించారు. అండర్–17 విభాగంలో బాలికల నుంచి కె.సిరిచందన, పి.మోక్షిత, పి.దివ్య పావని, బాలుర నుంచి పవన్ కిషోర్, సాయి గోపీచంద్ ఎంపికయ్యారన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కొయ్యలగూడెం: బయ్యనగూడెం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. అధ్యక్షుడిగా చింతలూరి శ్రీను, కార్యదర్శిగా కలవగంటి శ్రీను, కోశాధికారిగా కలవగంటి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా కలవగంటి కోట సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా లింగగిరి రామకృష్ణ, సహాయ కోశాధికారిగా లింగగిరి వీరాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెలుగు భాషోద్ధరణకు గురజాడ కృషి



భీమడోలు మండలం అన్నేవారిగూడెంలో గురజాడకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు, విద్యార్థులు



గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి



గోపన్నపాలెం హైస్కూల్‌లో గురజాడ అప్పారావుకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం డాక్టర్ మనోహర్

భీమడోలు: ఆధునిక తెలుగు కవిత్వానికి, సాహిత్యానికి మార్గదర్శకులు గురజాడ అప్పారావు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయం, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో గురువారం గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యాన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో హెచ్‌ఎం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్‌కే మస్తాన్ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషోద్ధరణకు గురజాడ ఎనలేని కృషి చేసారన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీచర్లు ఎం.విజయకుమారి, సీహెచ్ రమ్యజ్యోతిబసు, ఎం.దుర్గాప్రసాదిని, పీఎం శారారాణి, కేటీఎస్ రవికుమార్, వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

అభ్యుదయవాది గురజాడ

గణపవరం: సమాజంలోని మూఢనమ్మకాలు, అన్యాయాలపై తన కలంతో గళమెత్తిన అభ్యుదయ రచయిత గురజాడ అప్పారావు అని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలా కుమారి అన్నారు. గురువారం గురజాడ జయంతి సందర్భంగా కళాశాల తెలుగు, సోషల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు వెంకటరమణ గురజాడ రచనలు, అందులోని పాత్రల ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కన్యాశుల్కంతో పాటు ఆయన రాసిన కథలు, కవితలు, గీతాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు అనురాధ, స్వరూపరాణి, వెంకట్రావు, చైతన్య, గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గురజాడ

దెందులూరు: కన్యాశుల్కం రచించి సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహాకవి గురజాడ అప్పారావు ఆదర్శప్రాయుడని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎం.మనోహర్ అన్నారు. గురువారం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు మాసగిరి శ్రీనివాస్ ఆధ్వర్యాన గురజాడ అప్పారావు జయంతి వేడుకలు జరిగాయి. కొవ్వలిలో హెచ్‌ఎం శర్మ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. దెందులూరులో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, గారపాటి హైమావతి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామశర్మ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. గురజాడ అప్పారావు జీవిత విశేషాలను హెచ్‌ఎంలు, విద్యార్థులకు వివరించారు.

'కన్యాశుల్కం' అజరామరం

ఉంగుటూరు: గురజాడ రాసిన కన్యాశుల్కం అజరామరం అని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.వెంకటరమణ అన్నారు. గురువారం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరమణ మాట్లాడుతూ విద్యా, సామాజిక, భాష, సాహిత్య మార్పునకు పునాదుల వేసిన మహనీయులు గురజాడ అని, వాడుక భాషలో అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకం అజరామరమని అన్నారు. గురజాడ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ ఆధునిక మహిళ రాజ్యేలబోతుందని 150 సంవత్సరాల క్రితమే తెలిపిన దార్శనికులు గురజాడ అని అన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు , తదితరులు మాట్లాడారు. గురజాడ చిత్రటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకులు వెంకటరమణను సత్కరించారు. కైకరంహైస్కూలులో గురజాడ జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈవో 2 కె.శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయులు కె.రాజకుమారి, ఎం.రవి పాల్గొన్నారు గురజాడపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, గేయాలు, నాటిక, నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు.

దొరమామిడిలో పర్యటించిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతమైన దొరమామిడిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం రాష్ట్రంలోని మోడల్ కేంద్రంగా ఉండటం అభినందనీయమని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పి.శ్రీపూజ అన్నారు. బుట్టాయగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె దొరమామిడిలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చెత్త సేకరణ, సంపద తయారీ విధానాన్ని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ తరువాత గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయాన్ని సందర్శించారు. సర్పంచ్ తెల్లం రాముడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి పూజలు



పెదపాడు మండలం తాళ్లమూడిలో విఘ్నేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



దెందులూరు మండలం సీతంపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

పెదపాడు: మండలంలోని గణపతి నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కొత్త ముప్పర్రు, కొత్తూరు గ్రామంలో విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. తాళ్లమూడిలో అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారికి డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా కాల్చి గ్రామోత్సవం నిర్వహించారు, తర్వాత కృష్ణా కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

వైభవంగా ఉత్సవాలు

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాలు గ్రామ గ్రామాన వైభవంగా జరుగుతున్నాయి. వినాయకుడి ఆలయాల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పందిళ్లల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం సీతంపేటలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కోటిపల్లి సత్తిరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



చిలకంపాడులో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: జగన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం అని, వైద్యసేవలను అందరూ వినియోగించుకోవాలని గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. గురువారం మండలంలోని చిలకంపాడు గ్రామంలో పథకం అమలులో భాగంగా ఆరోగ్య సర్వే నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమస్యలను నమోదు చేశారు. వచ్చేనెల 5వ తేదీన గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తామని, అనారోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యులతో పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గురువారం ఎంపీడీవో ఆంజనేయులు, డాక్టర్ శ్రావణ రెడ్డి పరిశీలించారు. ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ఇంటింటా తిరిగి సర్వే చేశారు. పంచాయతీ కార్యదర్శి రవి ఆధ్వర్యాన సర్వే జరిగింది.

ఘనంగా నిమజ్జనోత్సవం



భీమడోలులో నృత్య ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులను అభినందిస్తున్న ఎస్సై సురేష్ కుమార్



పూళ్లలో నిమజ్జనానికి బయల్దేరిన భారీ గణనాథుడు

భీమడోలు: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పూళ్ల, భీమడోలు, గుండుగొలను, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో గురువారం గణపతి నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పూళ్ల హైస్కూలు వద్ద ఏర్పాటు చేసిన గణపతి, జంగం వీధిలోని మహాగణపతి, సీతారామయ్య కాలనీ నందు ఏర్పాటు చేసిన బుజ్జి గణనాధులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు పురవీధుల్లో కొనసాగింది. యువకులు, విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణపతి బొప్పా మోరియా అంటూ జైజై నినాదాలతో ఆ ప్రాంతాలు హోరెత్తాయి. బుధవారం రాత్రి భీమడోలులోని శ్రీమన్మహా గణపతి ఆలయం వద్ద 59వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏలూరులోని నృత్యాంజలి కళానికేతన్ గండికోట రాజేష్ శిష్య బృందం ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. వారిని ఎస్సై చావా సురేష్ కుమార్ అభినందించారు. స్వామివారు పసుపు వర్ణంతో భక్తులకు దర్శనమిచ్చారు.

నాడు–నేడు పనులను త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్

పెదవేగి : పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పెదవేగి ఎంపీడీవో జీఆర్ మనోజ్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అసంపూర్తిగా మిగిలిన పనులు, ఇంకా ప్రారంభించని పనులను పూర్తి చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా రూ.40 లక్షల నిధులు ఉన్నాయని, నిధులు లేని పాఠశాలలకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు బుధవాస్, అరుణ్ కుమార్, నోడల్ ఆడిటర్ ప్రభాకర్ గుప్తా, ప్రధానోపాధ్యాయులు సురేష్, ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు

పెదపాడు: ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయశాఖ ఏడీ సుబ్బారావు సూచించారు. మండలంలోని వట్లూరులో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూములను పరిశీలించారు. పరిసరాల పరిశీలనలో కాండం తొలుచు పురుగు ఉనికిని గమనించినట్లు చెప్పారు. అనంతరం ఏఓ ప్రదీప్‌కుమార్‌తో కలిసి ఆయన రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కాండం తొలుచు పురుగు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే పురుగుమందులు, ఎరువులు వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. అనంతరం రైతులతో బృంద విన్యాసాలు చేయించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాల తీవ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



కుక్కునూరు పాత పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

కుక్కునూరు: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రతపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్టు ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజ చెప్పారు. మండలంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఆయన డీఎంఅండ్‌హెచ్‌ఓ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, తహసీల్దార్, ఎంపీడీఓలతో కుక్కునూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్షతో పాటుగా ప్రభుత్వం తరుపున అందిస్తున్న వైద్యసేవలను తెలియపరిచేలా వలంటీర్‌లను ప్రతి ఇంటికి పంపి చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. అనంతరం కివ్వాక గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గత ఏడాది గోదావరి వరదల కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు పాత పీహెచ్‌సీ భవనంలో పూర్తయిన మరమ్మతు పనులను పరిశీలించి ప్రస్తుతం వైద్యశాలను నిర్వహిస్తున్న భవనం నుంచి పాత భవనానికి మార్చాలని ఆదేశించారు. అంతేకాక జిల్లా పరిషత్ హైస్కూల్ లో నాడు–నేడు పనులను, పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.సరిత్త, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.మేరికేథలిన్, తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఓకు వినతి పత్రం అందజేత

కుక్కునూరు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కుక్కునూరు ఎంపీపీ గీతావాణి, వైస్ ఎంపీపీ తాంత్ర రాజేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు గురువారం ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, మిగులు భూములకు సంబంధించి మార్పులు చేర్పులు చేసుకునేలా అవకాశం కల్పిస్తూ ఫ్రీజ్ చేసిన వెబ్ ల్యాండ్‌ను ఓపెన్ చేయాలని, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వలేదు కనుక పరిహారం అందించే వరకు పోలవరం పరిహారం చెల్లించిన భూములలో మోటార్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఎలుకలు.. రైతులకు తిప్పలు



పంటను పాడు చేస్తున్న ఎలుకలను చూపుతున్న రైతులు

పెదవేగి : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎలుకలు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎలుకలు ఈనిక దశలో ఉన్నాయి. బుట్టలతో ఎలుకలను రైతులు పట్టిస్తున్నారు. దీంతో ఎలుకల బుట్టలు పెట్టే వారికి డిమాండ్ పెరిగింది. ఎకరానికి 35–45 ఎలుకలను పట్టుకుంటున్నారు. ఎలుకలను పట్టే ప్రత్యేక నేర్పరులు ఉండి మండలం పాందూరు నుంచి పెదవేగి మండలంలోని సూర్యారావుపేట వచ్చారు. పంట గుబురుగా, దట్టంగా పెరిగిన చోట ఎలుకలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని ఎలుకలను పట్టే దగరపు భాస్కరరావు, చెక్కా పెద్దిరాజు, గారపాటి ప్రసాద్‌లు తెలిపారు. గింజలు తయారయ్యాక వాటిని నాశనం చేసి, బొరియల్లోకి తీసుకెళ్తాయని చెబుతున్నారు. ఒక్క ఎలుక పడితే రైతులు రూ.10 ఇస్తారని, రోజుకు ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.800 వరకు వస్తుందని చెబుతున్నారు.

వరకట్న వేధింపులపై కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపులపై పలువురు మహిళలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఏలూరు మండలం వంగాయగూడెంకు చెందిన గంచారి శ్రీకాంత్‌కు, జంగారెడ్డిగూడెంకు చెందిన నాగేశ్వరికి జూలై 31, 2023లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నంగా రూ.3 లక్షలు, 2 కాసుల బంగారం, రూ.1 లక్ష సారె కింద ఇచ్చారు. అయితే శ్రీకాంత్ అధిక కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నారని నాగేశ్వరి ఫిర్యాదు చేయడంతో శ్రీకాంత్, మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

- వేగవరానికి చెందిన బండి వీర్రాజు, లక్ష్మిలకు వివాహమై 18 ఏళ్లు అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు గురైన వీర్రాజు సొమ్ముల కోసం దుర్భాషలాడుతూ మానసికంగా, శారీరికంగా వేధిస్తున్నాడని లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- కుక్కల రాజు, సాయి స్నేహలకు 2019లో వివాహం కాగా వీరికి ఒక బాబు ఉన్నాడు. వివాహ సమయంలో 2 సెంట్లు భూమి, పెళ్లి ఖర్చుల కింద రూ.2 లక్షలు, అరకాసు బంగారు ఉంగరం కట్నంగా ఇచ్చారు. అయితే ఇటీవల అధిక కట్నం తీసుకురావాలని రాజు, అతని కుటుంబ సభ్యులు మరో ముగ్గురు కలిసి వేధిస్తున్నారని స్నేహ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- గుంజ శ్రీను, లక్ష్మిలకు 2010లో వివాహం కాగా ఆ సమయంలో రూ.5 లక్షలు కట్నంగాను, రూ.10 వేలు ఆడపడుచు లాంఛనం, నాలుగు కాసుల బంగారం ఇచ్చారు. మద్యానికి బానిసైన శ్రీను అధిక కట్నం కోసం వేధిస్తున్నాడని, అతని కుటుంబసభ్యులు మరో ఆరుగురు అతనికి సహకరిస్తున్నారని లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైతులను ఆదుకోవాలి

ఉంగుటూరు: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. గురువారం కైకరంలో నిర్వహించిన సంఘ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం: మండలంలోని కాశిపాడు, సరిపల్లె, వరదరాజపురం, పిప్పర విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి



విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయిస్తున్న లయన్స్ జోన్ చైర్మన్ సత్యనారాయణ

గణపవరం: సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి కోరారు. గురువారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్, లయో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యాన కళాశాలల విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. శాంతి ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైతేనే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావూరి నాగరాజు, సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన బొద్దులూరి సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోపీనాథ్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.